ప్రజాశక్తి
సోమవారం 10 జులై 2023 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

కష్టాల సుడిలో అంగన్‌వాడీలు

- కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు కరువు
- హామీల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం
- నేడు, రేపు కలెక్టరేట్ల వద్ద నిరసనలు

పిల్లలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న అంగన్‌వాడీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదు. చాకిరి బారెడు, జీతం మూరెడు అనే చందంగా వీరి పరిస్థితి ఉంది. సమస్యల పరిష్కారానికి ఎన్నో వినతులు, ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వాల చెవికి ఎక్కట్లేదు. పేరుకు ప్రభుత్వం ఉద్యోగం అయినా కనీస వేతనాలుగానీ, రిటైర్మెంట్ బెన్ఫిట్స్‌గానీ ఏమీ అమలు కావట్లేదు. జాబ్‌చార్ట్‌తో సంబంధం లేని అనేక పనులను వీరితో చేయిస్తున్నారు. ప్రభుత్వాలు ఎన్నికల్లో ఓట్ల కోసం ఇచ్చిన హామీలు కాగితాలకే పరిమితం అయ్యాయి. సంక్షేమ పథకాలూ వర్తింప చేయట్లేదు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీలు పోరాటానికి సన్నద్ధమయ్యారు. సోమ, మంగళవారాల్లో కలెక్టరేట్ వద్ద 36 గంటల నిరసన చేపట్టారు.

ప్రజాశక్తి-గుంటూరు

గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ రక్తహీనత నివారించటంలో, పిల్లలు ప్రైమరీ విద్యకు సన్నద్ధం చేయటంలో అంగన్‌వాడీలు కీలక పాత్ర పోషిస్తున్నారు. పేద మహిళలు, పిల్లల సంక్షేమం కోసం పనిచేస్తున్న అంగన్‌వాడీల సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరిస్తోంది. ప్రతి ఏటా బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు కుదిస్తూ నిర్వీర్యం చేయాలని చూస్తోంది. చట్టాలు సాధించుకోవటంతోపాటు, ఉన్న చట్టాలు అమలు చేయించుకోవటానికీ పోరాడాల్సి వస్తోంది.

విభజిత గుంటూరు జిల్లాలో ఆరు ప్రాజెక్టుల పరిధిలో 1500 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటిల్లో 3 వేల మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పని చేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 2006 సెంటర్లున్నాయి. వీటిల్లో 4020 మంది ▶ 2లో

ఉత్తర్వులున్నా పథకాలు అమలు చేయట్లేదు

గతంలో చేసిన అనేక ఆందోళనల వల్ల అంగన్‌వాడీలకూ సంక్షమ పథకాలు వర్తింపజేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉత్తర్వులు ఇచ్చినా అమలు కావట్లేదు. పథకాలకు దరఖాస్తు చేసుకుంటే మా పేర్లను నిర్ధాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంక్షేమ పథకాలు, కనీస వేతనాలు అమలు చేయాలి. ప్రభుత్వం ఇదే నిర్లక్ష్య ధోరణి అనుసరిస్తే రానున్న కాలంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తాం.

దీప్తి మనోజ, అంగన్‌వాడీ యూనియన్ గుంటూరు జిల్లా కార్యదర్శి

ప్రభుత్వం చర్చలకు పిలవాలి

తెలంగాణ ప్రభుత్వం కంటే రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలి. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం తమిళనాడు, కర్నాటక ప్రభుత్వాలు గ్రాట్యుటీ ఇవ్వటానికి ఉత్తర్వులు ఇచ్చాయి. ఏపీలో కూడా అమలు చేయాలి. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలి. స్కూల్ పిల్లలకు ఇచ్చినట్లు యూనిఫాం, షూస్ ఇవ్వాలి. పిల్లల్ని ఆడించాల్సిన అంగన్‌వాలకు ఫోన్లు ఇచ్చి, రకరకాల యాప్‌లతో వేధింపులు ఆపాలి. సమస్యలపై చర్చలకు పిలవాలి.

గుంటూరు మల్లేశ్వరి, అంగన్‌వాడీ యూనియన్ పల్నాడు జిల్లా కార్యదర్శి

మాట్లాడుతున్న యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్

జిపిఎస్‌కు అంగీకరించేది లేదు : యుటిఎఫ్

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

సిపిఎస్ స్థానంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని, దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారథి స్పష్టం చేశారు. యుటిఎఫ్ పల్నాడు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పి.ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారం రోజుల సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి హామీనిచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా సిపిఎస్‌ను రద్దు చేయకపోగా జిపిఎస్ అంటూ కొత్త నాటకానికి తెరదీశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిపిఎస్ పథకం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లో సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ అమలు చేశాయని తెలిపారు. ఇప్పటికైనా సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని, అప్పటి వరకూ యుటిఎఫ్ ▶ 2లో

వేగంగా అభివృద్ధి పనులు

- క్షేత్రస్థాయి సమస్యలపై ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలు
- గడపగడపకు ప్రభుత్వంలో వచ్చిన పనులకు ప్రాధాన్యం
- ప్రజాశక్తితో జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి శేషశ్రీ

8వ పేజీ

గణనీయంగా తగ్గిన సాగు

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతిపైనే దృష్టి - స్థానికంగా ఉత్పత్తికి ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూరగాయల సాగు పెరగడంలేదు. ఏటా ఆరు నెలలు ధరలు పెరగడం, ఆరు నెలలు గణనీయంగా తగ్గడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం టమోటా రూ.120, పచ్చి మిర్చి రూ.100 వరకు పలుకుతున్నాయి. మిగతా కూరగాయలన్నీ కిలో రూ.30 నుంచి రూ.50 వరకు పలుకుతున్నాయి. రాజధాని ఆవిర్భావానికి ముందు తుళ్లూరు, తాడేపల్లి, మంగళగిరి మండలాల్లో 10 వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరిగేది. రాజధానికి రైతుల నుంచి ప్రభుత్వం భూములు తీసుకోవడంతో ఈ ప్రాంతంలో సాగు నిలిచిపోయింది. రాజధాని పరిసర గ్రామాల్లో ఐదేళ్లక్రితం భూముల విలువపెరగడంతో చాలా మందిసాగు నుంచి ఉపసంహరించుకుని తమ భూములను వ్యాపారులకు విక్రయించడంతో సాగు విస్తీర్ణం మరింత తగ్గింది. జిల్లాలోని డెల్టా ప్రాంతంలో వివిధ రకాల కూరగాయలు పండించే వారు. డెల్టాలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల కూడా కూరగాయల ఉత్పత్తి సరిగా జరగడం లేదు. మొత్తంగా గతంలో ఉమ్మడి జిల్లాలో 30 వేల ఎకరాల్లో కూరగాయాల సాగు జరిగేది. ప్రస్తుతం గుంటూరుజిల్లాలో 2022-23లో 5600 ఎకరాల్లోనే కూరగాయల సాగు జరుగుతోంది. పల్నాడు జిల్లాలో నాలుగు వేల ఎకరాల్లో సాగు అవుతోంది.

జిల్లాలో ఒకప్పుడు క్యారెట్, బెండ,దొండ, టామాట, క్యాబేజి,కాలీఫ్లవర్, వంగ, పచ్చి మిర్చి, కంద, పెండలం, పొట్లకాయలు ఎక్కువగా ఉత్పత్తి ▶ 2లో

ముందే మునక

- మంచికలపూడి పొలాల్లో నిలిచిన నీరు
- బయటకు వెళ్లే మార్గం అవస్థ పడుతున్న రైతులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

వర్షాలకు ముందే పొలాల్లోకి నీరు చేరింది. బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో పంటలు ఎలా వేసుకోవాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు. దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడిలో సిసిఎల్ ఫ్యాక్టరీ, రైల్వే ట్రాక్ మధ్యలో సుమారు 100 ఎకరాలకుపైగా పొలాలున్నాయి. వీటిల్లోకి ఖరీఫ్‌లో వరి, అనంతరం బెండ, మొక్కజొన్న పంటలు సాగు చేస్తుంటారు. ఈ పొలాలకు మోరంపూడి సమీపంలోని కాల్వ నుండి నీరు వస్తుంది. ఈ నీరు మగ్గిన కాల్వ ద్వారా బయటకు వెళు తుండేది. ఈ ఏడాది మూడో రైల్వేలైను వేసే క్రమంలో నీరు బయటకు వెళ్లే తూమును పూడ్చేయడంతో వందల ఎకరాల్లో నీరు బయటకు వెళ్లే మార్గం లేక పొలాల్లోనే నిలిచింది. రెండో పంట ముగియడంతో ఖరీఫ్‌కు విత్తనాలు వేసుకునేందుకు పంటలు సిద్ధం చేసుకోవాలంటే పొలాల్లో నీరు అడ్డుగా ఉంది. మరోవైపు వర్షాలు లేక రైతులు ఇంకా నార్లు పోసుకోలేదు. ఇప్పుడు నీరు నిలిచిపోవడంతో సాగు కష్టమవుతోంది. సీజన్ దాటిపోతుందనే భయం రైతుల్లో నెలకొంది. సీజన్‌కు ముందే నీరు నిలిచిపోవడంతో ఇక వర్షాలు వస్తే ఆ ప్రాంతం మొత్తం ▶ 2లో

పొలాల్లో నిలిచిన నీరు

జిపిఎస్‌కు అంగీకరించేది లేదు : యుటిఎఫ్

(మొదటి పేజీ తరువాయి)

పోరాడుతుందని, ఇతర సంఘాలతో కలిసి ఉధృత ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. విజయసారధి మాట్లాడుతూ సిపిఎస్ పథకంలో కొన్ని మార్పులు చేసి జిపిఎస్‌గా పేరుపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం మభ్యపెడుతోందన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టాలని గ్యారంటీ పెన్షన్ విధానం (జిపిఎస్) పథకంలో సైతం ఉద్యోగి తన జీతం నుండి 10 శాతం ప్రభుత్వానికి చెల్లించాలని 33 శాతం పెన్షన్ గ్యారంటీ అని చెప్పడమేగాని గ్యారెంటీ లేదని అన్నారు. ఎన్నికల వాగ్దానం మేరకు సిపిఎస్ రద్దు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పాత పెన్షన్ ఎందుకు అమలు చేస్తున్నారో? ఉద్యోగ ఉపాధ్యాయులకు సమాధానం చెప్పాలన్నారు. 117 జీవో వల్ల ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు రద్దుచేసి ప్రమోషన్లు ఎంఇఒ-2 పోస్టులు సృషించడం సరికాదన్నారు. ఉపాధ్యాయుల కొరతతో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరైన విద్య అందదని, పాఠశాల విద్య బలహీనపడి భవిష్యత్తులో ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో చేరిక ఉండదని చెప్పారు. ఇదిమొత్తం ప్రభుత్వ విద్య నిర్వీర్యం, ప్రైవేటీకరణకు మార్గం మరింత సులభతరం అవుతుందని హెచ్చరించారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచించాలన్నారు. సమావేశంలో నాయకులు కె.శ్రీనివాసరావు, ఎం మోహన్ రావు, ఏ.బాగేశ్వరిదేవి, జె.వాల్యా నాయక్, వి.నాగేశ్వరరావు, ఆర్.అజయ్‌కుమార్, కె.ఉషాసౌరి రాణి, ఎ.శ్రీనివాసరావు, షేక్ జమాల్, షేక్ గఫార్, రాష్ట్ర కౌన్సిలర్లు శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.సుందర్రావు పాల్గొన్నారు.

గణనీయంగా తగ్గిన సాగు

(మొదటి పేజీ తరువాయి)

అయ్యేవి. కూరగాయల సాగు దారులకు అమ్మడబోతే అడవి...కొనబోతేకొరవి అన్న చందంగాపరిస్థితులు ఏర్పడ్డాయి. ఉత్పత్తులు చేతికి వచ్చినప్పుడు వ్యాపారులు సిండికేట్ అయి కిలోరూ.2నుంచి రూ.5లోపు కొనే వారు.రైతు బజార్లకు రైతులే తెచ్చుకుని విక్రయించుకోవాలన్న అధికారుల దయా దాక్షిణ్యాలపై ఉంటుంది. ఒక్కోసారి బెండ, దొండ, వంకాయి,క్యాబేజి వంటి కూరగాయలు కోసేందుకు అయ్యే కూలి కన్నా రైతులకు దక్కే ధర బాగా తక్కువగా ఉండేది. రవాణాఛార్జీలు తడిసిమోపెడు అవుతున్నాయి.రైతులు నేరుగా పొలం నుంచి ఆటోల్లో రైతు బజార్లకు వచ్చినప్పుడు కిలోరూ.10 నుంచి 15లోపు ధరలు నిర్ధేశించే వారు. దీంతో చాలా మంది సాగు మానేశారు. అంతేగాక ఆకాల వర్షాలు, అధిక వర్షాలతో తోటలు దెబ్బతినడం పరిపాటైంది. ఈ ఏడాది ఏప్రిల్ చివరినుంచి మే 8 వరకు అకాల వర్షాలతో ఆకుకూరల తోటలు దెబ్బతిన్నాయి. బాపట్ల నుంచి గతంలో పచ్చిమిర్చి జిల్లా మొత్తం సరఫరా అయ్యేది.ఈ ప్రాంతంలో సాగు,దిగుబడి తగ్గడంతో ఇప్పుడు ఇతర బెంగుళూరు నుంచి తెప్పిస్తున్నారు. దీంతో ధర కిలో రూ.100కు పెరిగింది.

గతంలో ఉమ్మడి కృష్ణా, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చే కూరగాయలు ఇప్పుడు పూర్తిస్థాయిలో రావడంలేదు. ఉద్యాన శాఖ కూడా కూరగాయల సాగుకు రైతులను ప్రోత్సహించడం లేదు. విస్తీర్ణం పెంపుపై శ్రద్ధ కొరవడింది. గతంలో మిద్దెలపై కూరగాయల సాగును ప్రోత్సహిస్తామని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు చేసిన ప్రకటనలు ఆరంభశూరత్వంగా మిగిలాయి. ఎగువ మధ్యతరగతి వారు భారీగా పెట్టుబడి పెట్టి తమ డాబాలు, అపార్టుమెంట్స్ ఎగువ భాగంలో మిద్దెసాగు ప్రారంభించినా శ్లాబులు దెబ్బతింటున్నాయని చాలా మంది అర్ధాంతరంగా ఉపసంహరించుకున్నారు.

వ్యక్తిగత విమర్శల వల్ల ఉపయోగం ఉండదు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : ప్రజా సమస్యలపై పవన్ కల్యాణ్ పోరాడుతుంటే వైసిపి మాత్రం వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు కరిముల్లా అన్నారు. ఈ మేరకు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. వారాహి యాత్ర ద్వారా జనసేనకు పెరిగిన ప్రజాదరణను వైసిపి తట్టుకోలేకపోతోందని అన్నారు. పవన్ కల్యాణ్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. దానివల్ల జనాలకు ఉపయోగమేమీ ఉండదన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.అప్పారావు, డి.సూర్య, వై.నాగభూషణం, ఎం.గోపికృష్ణ పాల్గొన్నారు.

అత్యవసర విభాగంలో మార్పులు

- **ఐసియులో అయిదు మంచాలు**
- **జిజిహెచ్‌లో కొనసాగుతున్న సూపరింటెండెంట్ తనిఖీలు**

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్) క్యాజువాల్టిని రోగులకు సత్వర వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పని చేస్తున్నానని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. క్యాజువాల్టి, ఇతర విభాగాలో ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేసిన ఆయన తొలుత ఇంటి నుంచి ఉదయం నేరుగా క్యాజువాల్టీ చేరుకున్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు నిరాటకంగా తనిఖీ లు చేశారు. అత్యవసర విభాగం వద్ద అంబులెన్స్‌లు, కార్లు, ద్విచక్ర వాహనాలు అడ్డదిడ్డంగా ఉన్నాయి. వాహనాలను నియంత్రణకు ఏమైనా చర్యలు తీసుకున్నారా అని సెక్యూరిటీ సిబ్బందిపై మండిపడ్డారు. సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రవేశ ద్వారం పూర్తిగా తెరవకుండా సగం తలుపులు తెరిచి ఉంచటాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడ సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఓపీ రిజిస్ట్రేషన్‌లో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఒక్కరే ఉండటంపై అయన అసహనం వ్యక్తం చేశారు. రోజుకు వందల సంఖ్యలో రోగులు వస్తుంటే ఒక్క ఆపరేటరే ఎలా సరిపోతారని నిర్వాహకుడు బాలకృష్ణను ఫోన్‌లోనే ప్రశ్నించారు. ఈ-రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ప్రింటర్లను ఏర్పాటు చేసి ఆపరేటర్లు ఇద్దరినీ నియమించాలన్నారు. రోగి సమాచారం తీసునేటప్పుడు ఆధార్ నంబర్‌తో పాటు ఫోన్ నంబర్ కూడా తీసుకోవాలని సూచించారు. ఫోన్ నంబర్ లేకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని సూపరింటెండెంట్ దృష్టికి పోలీసులు తేవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇసిజి గదిలో ఇసిజి టెక్నీషియన్‌గా ఒక స్టూడెంట్ ఉండటాన్ని చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. రెండు ఇసిజి మిషన్‌లు ఒక మిషన్ పని చేయడం లేదని సిబ్బంది చెప్పడంతో మరమ్మతులకు ఆదేశించారు. మహిళలకు పరీక్షలు చేసే సమయంలో ఒక నర్సుతో పాటు మహిళా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలన్నారు. క్యాజువాల్టి ట్రయేజ్ ఐసియు అస్తవ్యస్తంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సరైన మంచాలు లేకపోవడంతో వెంటనే వర్క్‌షాపు నుంచి 5 పడకలను తేవాలని ఆదేశించగా సిబ్బంది వాటిని ఏర్పాటు చేశారు. మానిటర్లు కూడా పని చేయడం లేదని గుర్తించారు. ఉన్నా రెండు మానిటర్లు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఐసియులో బెడ్‌కు ఒక్కొక్క మానిటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. క్యాజువాల్టి మెడికల్ ఆఫీసర్‌కు సహాయం చేస్తూ రోగిని వెంటనే వార్డుకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసరంగా రోగులను చూసేందుకు సిపిఆర్ చెయ్యడానికి ఎమర్జెన్సీ డాక్టర్లు లేకపోవడాన్ని గుర్తించారు. ఈ విషయాన్ని క్యాజువాల్టి డాక్టర్ రాధికకు ఫోన్ చేసి వెంటనే సీనియర్ రెసిడెంట్ డాక్టర్లను నియమించాలని ఆదేశించారు. క్యాజువాల్టీ విభాగంలో మైనర్ ఆపరేషన్ థియేటర్‌లో సదుపాయాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే థియేటర్‌కు అవసరమైన విద్యుత్ లైట్లు ఇతర సౌకర్యలను అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసరంగా ఆపరేషన్‌లు చేసేందుకు అనుకూలమైన వాతావరణం ఉంచాలన్నారు. కాన్పుల వార్డులో రోగులకు ఏర్పాటు చేసిన బాత్‌రూమ్‌లు అస్తవ్యస్తంగా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగుల సహాయకులు ఎక్కువ సంఖ్యలో వెళ్లడం వల్ల దుర్వాసన వస్తోందన్నారు. వెంటనే సెక్యూరిటీ సిబ్బందిని నియమించి రోగుల సహాయకులను నియత్రించాలని సూచించారు.

తనిఖీలు చేస్తున్న సూపరింటెండెంట్

కాన్పుల వార్డులో కడుపులో బిడ్డ చనిపోయి ఉన్న తల్లిని ఆయన పరామర్శించారు. ఆమెకు అందుతున్న వైద్యం గురించి వివరాలు అడిగారు. 24 గంటల ఆల్ట్రాసౌండ్ గదిని పరిశీలించి అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను అందుబాటులో ఉండాలని సూచించారు. క్యాజువాల్టిలో ఉన్న రోగులకు సత్వరమే వైద్య సేవల కోసం వార్డులోకి పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ సూపరింటెండెంట్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎం.గోవింద నాయక్ ఐసియు రోగులను వార్డుల్లోకి పంపించే విధంగా చేయాలనీ ఆయన ఆదేశించారు. చోరీలను అరికట్టేందుకు అవసరమైన చోట సిసి కెమెరాలను ఏర్పాటు చేయాన్నారు. సూపరింటెండెంటి వెంట అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శ్రావణ్ కుమార్, నర్సింగ్. సూపరింటెండెంట్ షేక్ షమీన బేగం, బయో మెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ ఉన్నారు.

కష్టాల సుడిలో అంగన్‌వాడీలు

(మొదటి పేజీ తరువాయి)

టీచర్లు, ఆయాలు పని చేస్తున్నారు. టీచర్లకు రూ.11500, ఆయాలకు రూ.7 వేలు ఇస్తున్నారు. అంటే రోజుకు టీచర్లకు రూ.383, ఆయాలకు రూ.233 మాత్రమే వస్తోంది. ప్రస్తుత జీవన ప్రమాణాలు, పెరుగుతున్న నిత్యావసర ధరల ప్రకారం చూస్తే రోజువారీ కూలీలకు ఇచ్చే కూలిలో సగం వేతనం కూడా అంగన్‌వాడీలు పొందలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో జగన్ ప్రభుత్వం ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని వాగ్దానం చేశారు. కానీ ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో అమలు చేయనేలేదు. తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్లకు రూ.13500, ఆయాలకు రూ.10 వేలు ఇస్తున్నారు.

సంక్షేమం అందని ద్రాక్ష

అంగన్‌వాడీల సంక్షేమం కలగానే మిగిలింది. సామాజిక భద్రత కల్పించే చర్యలు శూన్యం. 2008లో కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు రూ.1500 వేతనం పెంచుతున్నట్లు ప్రకటించినా ఇంకా అమలు చేయనేలేదు. 25 ఏళ్లకుపైగా సేవలు అందించిన వీరికి రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కింద ఎంగిలి మెతుకులు విదిల్చినట్లు టీచర్లకు రూ.50 వేలు, ఆయాలకు రూ.20 వేలు ఇస్తున్నారు. వీటిని రూ.5 లక్షలకు పెంచాలని సుదీర్ఘకాలంగా పోరాడుతున్నారు. మెడికల్ లీవులు లేవు. ఏదైనా అనారోగ్యం వస్తే సెలవులు పెట్టుకుంటే ఆయా రోజులకు వేతనాలు కట్ చేస్తున్నారు. నెలలో రెండుసార్లు ప్రాజెక్ట్, సెక్టార్ మీటింగ్‌లకు అంగన్‌వాడీలు హాజరు కావాలి. అయితే అందుకు టిఎ బిల్లులు ఇవ్వాల్సి ఉన్నా 2017 నుండి ఇవ్వట్లేదు. దీంతో ఆ భారం కూడా అంగన్‌వాడీలు వారి వేతనాల నుంచే భరించాల్సి వస్తోంది. వేతనాలు కూడా సకాలంలో రావట్లేదు. రెండు నెలలకోసారి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమ పథకాలు ఒక్కటీ వీరికి వర్తించడం లేదు. పథకాలకు దరఖాస్తు చేసుకుంటే సచివాలయాల్లో మీరు ప్రభుత్వ ఉద్యోగులని, మీకు ఏ పథకమూ వర్తించదని చెబుతున్నారని అంటున్నారు. అంగన్‌వాడీల పిల్లలకు అమ్మఒడి, జెవికె కిట్లు దక్కట్లేదు. చేయూత, 200 యూనిట్లలోపు వినియోగించుకున్న వారికి ఉచిత విద్యుత్ పథకం, ఇతర పథకాలు ఏవీ అమలు కావట్లేదు. చనిపోయిన అంగన్‌వాడీలకు కనీసం మట్టిఖర్చులు కూడా ఇవ్వట్లేదు.

ముందే మునక

(మొదటి పేజీ తరువాయి)

చెరువులా మారుతుందని, సాగు కష్టమవుతుందని రైతులు ఆందోళనతో ఉన్నారు. ఉపాధి హామీ పనులు చేయించినా ఈ పొలాలకు సంబంధించిన కాల్వపై అధికారులు దృష్టి సారించలేదు. ఇప్పటికైనా స్పందించి నీరు బయటకు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

నీరు బయటకు పోయేలా చూడాలి

వై.బ్రహ్మేశ్వరరావు, రైతు సంఘం మండల కార్యదర్శి.

మంచికలపూడిలోని పొలాల్లో నిలిచినపోయిన నీరు బయటకు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలి. సాగుకు ముందే పొలాలు ముంపునకు గురైతే పంటలు ఎలా వేసుకోవాలి. నీరు బయటకు వెళ్లే మార్గం లేదని తెలిసినా అధికారులు స్పందించకపోవడం సరికాదు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతాం.

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తెనాలి శాఖ ప్రారంభం

ప్రజాశక్తి - తెనాలి

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తెనాలి శాఖ ఆదివారం ప్రారంభమైంది. పట్టణంలోని కుమార్ పంప్స్ ఆవరణ సత్సంగ్ మీటింగ్ హాలులో ఆదివారం ప్రారంభోత్సవ సభ, నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాంచంద్ అధ్యక్షతన జరిగిన సభలో సంస్థ వ్యవస్థాపకులు, కేంద్ర నియంత్రణ కమిటీ చైర్మన్, సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ తెనాలి నూతన మొదటి కార్యవర్గం ప్రమాణ స్వీకారం జరిగింది. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం రీజినల్ చైర్మన్ గాను, ముఖ్య సలహాదారులుగా మునగాల మోహన శ్యామ్‌ప్రసాద్, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఘట్టమనేని నాగేశ్వరరావు, తెనాలి పట్టణ ప్రముఖులు వుప్పల వరద రాజులు, చైర్మన్‌గా డాక్టర్ రామ్‌చంద్, కో-చైర్మన్గా డాక్టర్ శారద, అధ్యక్షులుగా కల్యాణి, కార్యదర్శిగా శ్రీనివాసబాబు, డైరెక్టర్లుగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ సోమయ్యశాస్త్రి, కటకం ప్రసాద్, వెంపటి సత్యనారాయణ, ఈసీ మెంబర్లుగా శర్మ, ధనుంజయరావు, రాజేశ్వరి, రాఘవరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. పోస్ట్ సంస్థ ప్రతినిధి శ్రీనివాసబాబు మానవతా సంస్థకు మార్చురీ ఫ్రీజర్ బాక్స్‌ను విరాళంగా ప్రకటించారు. తొలుత ప్రముఖ గాయకుడు వెంపటి సత్యనారాయణ గాన లహరి అందించారు. సంస్థ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ రామానుజులు రెడ్డి, స్టేట్ కన్వీనర్ జానకిరామరాజు, గుంటూరు శాఖ చైర్మన్ పావులూరి రమేష్, డైరెక్టర్ ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న చేస్తున్న సంస్థ బృందం

టిడిపి కార్యకర్త వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం అందజే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరానికి చెందిన టిడిపి కార్యకర్త పిల్లి బాబురావు ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు కె.మధుసూదన్‌రావు రూ.5 వేలను వైద్య ఖర్చుల నిమిత్తం బాబురావుకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఇ.బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్రమణ్యం, తెలుగు యువత నాయకులు ఎస్కే నాగూర్‌వలి, కె.సురేష్, జి.లక్ష్మణరావు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వేడుకలో విషాదం

ట్రాక్టర్ బోల్తా - ఇద్దరు మృతి

● 10 మందికి గాయాలు ● ఇద్దరి పరిస్థితి విషమం ● దుర్గి మండలంలో ఘటన

ప్రజాశక్తి - మాచర్ల

దుర్గి మండలం అడిగోప్పల నిదానంపాటి అమ్మవారి దేవాలయానికి సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడి ఇరువురు మృతిచెందగా 15 మంది కి పైగా గాయాలయ్యాయి ఇరువురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని మాచర్ల ప్రభుత్వాసు పత్రిలో ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. వివరాల ప్రకారం... దుర్గి మండలం నర్మాలపాడు గ్రామానికి చెందిన గురవయ్య మనవడి పుట్టినరోజు సందర్భంగా నిదానంపాటి అమ్మవారి దగ్గర జరుగుతున్న వేడుకకు బంధుమిత్రులతో ట్రాక్టర్ లో బయలుదేరి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది ఇరుకు రోడ్డు ఎదురుగా ద్విచక్ర వాహనం వస్తుండగా దానికి దారి ఇచ్చేందుకు ట్రాక్టర్ డ్రైవర్ రోడ్డు మార్జిన్ లోకి వెళ్ళగా ట్రక్కు ఒరిగి పక్కన ఉన్న మండలంలో పడింది ట్రక్కు కింద ఇద్దరు పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి వారిని మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందారు. చనిపోయిన వారు అదే గ్రామానికి చెందిన పాతూరు లక్ష్మీనారాయణ (43), దేవండ్ల భూదేవయ్య. జంబుల సాంబయ్య,ఎర్రం శెట్టి ఏడు

మృతులు భూదేవయ్య, లక్ష్మీనారాయణ

కొండలకు తీవ్ర గాయాలు కాగా వారిని మాచర్ల ప్రభుత్వా సుపత్రిలో ప్రధమ చికిత్స అనంతరం నరసరావుపేటకు తరలించారు ప్రమాద స్థలంలో స్వల్ప గాయాలైన వారిని అక్కడి నుండి ద్విచక్ర వాహనాలపై సమీప ప్రాంతాల్లోని పలు వైద్యశాలలకు తరలించారు కారంపూడి సిఐ జయకుమార్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. దుర్గి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హక్కుల సాధనకు సంఘటితం కావాలి

సచివాలయ ఉద్యోగుల సమావేశంలో ఎపిజిఇఎఫ్ నాయకుడు అరవపాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వం నుంచి రావాల్సిన సదుపాయాలు, హక్కుల సాధనకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు ఐకమత్యంగా సంఘటితం కావాలని ఎపి ప్రభుత్వ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎపిజి ఈఎఫ్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవపాల్ కోరారు.గుంటూరులోని పెన్షనర్ల భవనంలో ఆదివారం గ్రామ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర కౌన్సిల్ ఎక్జిక్యూటివ్ సమావేశం జరిగింది. సమావేశంలో అరవపాల్ ముఖ్య అతిథిగాపాల్గొన్నారు. రాష్ట్ర సచివాలయం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి రావలసిన ప్రయోజనాలు సాధించుకోవడానికి తమ యూనియన్ కృషి చేస్తుందని అరవపాల్ తెలిపారు. భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సంఘం బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. సంఘ సభ్యత్వం పెంచడంతో పాటు అన్ని జిల్లాలో కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశం లో ఏపిజిఈఫ్ రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు భాస్కరరెడ్డి, దేవపాల్, రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల సంఘం విలువలు, వాటిని బలోపేతం చేయడం కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు బత్తుల అంకమ్మ రావు, బి.ఆర్.ఆర్.కిషోర్, విప్పర్తి నిఖిల్ కష్ణ,భార్గవ్ సుతేజ్, మధుబాబు,పిల్లి హరీష్ రెడ్డి, భవనం వెంకట్రామిరెడ్డి,రవి కుమార్,సువర్ణ,బండారు శ్రీనివాసరావు, ఆళ్ళ శ్రీధర్ రెడ్డి, దారపు రెడ్డి తాతాజిరావు,గుజ్జర్ల శ్రీనివాస్,తోట మహేష్ తోట పూర్ణ, 26 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

'వినుకొండ అసెంబ్లీకి బిసి నాయకుడు పోటీ'

ప్రజాశక్తి-వినుకొండ

నియోజకవర్గ బీసీ సామాజిక వర్గ సమావేశం స్థానిక బీసీ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమా వేశంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ సంఘం సెక్రటరీ మద్దుల వెంకట కోటయ్య పాల్గొని మాట్లా డుతూ రానున్న ఎన్నికలలో వినుకొండ అసెంబ్లీకి బిసి నాయకుడు పోటీ చేయనున్నట్లు చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను పదవులు ఇచ్చి మభ్యపెట్టడమే కాక వారిని అభివృద్ధి చెందకుండా నానా చాకిరి చేయిస్తూ అవమానిస్తున్నారని విమర్శించారు.

పెదకాకాని శివాలయం అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - తెనాలి

పెదకాకాని శివాలయం నూతన ధర్మకర్తల మండలి అభినందన సభ ఆదివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని మాట్లాడారు. ఆలయ అభివృద్ధికి ధర్మకర్తల మండలి బృందం కృషి చేయాలన్నారు. విశిష్ట అతిథులుగా ప్రభుత్వ చీఫ్ విప్ ఉమ్మా రెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, తాడిశెట్టి మురళీమోహన్ పాల్గొన్నారు. అతిథులందరినీ మేళతాళాలు, భాజా భజంత్రీల మధ్య స్వాగతం పలికారు. ఆలయ కమిటీ తరపున అతిథులను సత్కరించారు. కార్యక్రమాన్ని ఆలయ సహాయక కమిషనర్ ఎన్.శ్రీనివాసరెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పర్యవేక్షించారు. ధర్మకర్తల మండలి సభ్యులు జి.సుబ్బాయమ్మ, కె.శివరత్నాలు, టి.రవీంద్ర, కె.నాగేశ్వరమ్మ, మల్లేశ్వరరావు, జి.వెంకటరావు, సిహెచ్ అరుణ, పి.వెంకటేశ్వరరావు, ఎం.జ్యోతి, కె.పార్వతి, పి.లక్ష్మీనారాయణ, వరప్రసాద్, సర్పంచి జి.స్వరూప రాణి, జెడ్పిటిసి జి.జ్యోతి, ఎంపిపి టి.శ్రీనివాసరావు, దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయం చైర్మన్ రాంబాబు పాల్గొన్నారు

రామకష్ణయ్య ట్రస్ట్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-గుంటూరు: మద్దు రామకృష్ణయ్య చారిటబుల్ ట్రస్ట్ సామాజిక సేవలు అభిందనీయమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ అన్నారు. ఆకలైన వారికి అన్నం పెట్టడం, దాహమేస్తే తాగునీరు, విద్యార్థులకు ఉపకార వేతనాలు, వృద్ధులకు వైద్య సేవలు, పింఛన్లు ద్వారా ఆదుకుంటున్నారన్నారు. రామకష్ణయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో వరుసగా నాలుగవ సంవత్సరం, 200 మంది వృద్ధులకు ప్రతి నాలుగు నెలలకు రూ.1600 చొప్పున రూ.3.20 లక్షల పింఛన్లతోపాటు, వృద్ధులకు ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందించే కార్యక్రమం స్థానిక కాకాని రోడ్డు ఎఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి, వృద్ధాప్య పింఛన్లు అందించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రస్ట్ సేవలను కొనియాడారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు రామకష్ణయ్య మాట్లాడుతూ సమాజ సేవ చేసేందుకు తన తల్లిదండ్రులు, భార్య, బిడ్డలు అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు.

గంజాయిని రవాణా చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - చేబ్రోలు

గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు తెనాలి సబ్ డివిజన్ డిఎస్పి పర్యవేక్షణలో గత వారం రోజుల వ్యవధిలో పొన్నూరు రూరల్ ఇన్స్పెక్టర్ పి ప్రభాకర్ ఆధ్వర్యంలో చేబ్రోలు ఎస్ ఐ కె.ఆనంద్,జి.వెంకటాద్రి చేబ్రోలు స్టేషన్ సిబ్బందితో అక్రమంగా గంజాయి తరలిస్తున్న సంఘవిద్రోహులపై చేబ్రోలు పోలీసుల ఉక్కు పాదం మోపారు. వేరువేరుగా గంజాయి రవాణా చేస్తున్న కొత్త రెడ్డిపాలెం వాసి షేక్ అషర్ (25), రాజేష్ బరికి (28) ఒడిశాలోని కటక్ జిల్లాలోని కిందరపడ్డ గ్రామం. ప్రస్తుతం చేబ్రోలు మండలం నివాసి. వీరిని పట్టుకుని సుమారుగా మూడు కేజీల గంజాయిని సీజ్ చేసి అక్రమంగా రవాణా చేస్తున్నందుకు కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. అలాగే,మూడు రోజుల క్రితం బహిరంగంగా గంజాయి సేవిస్తున్న వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకు చెందిన ఇరవై ఏళ్ల నీలా తామస్పాల్ వాసిని పట్టుకొని అరెస్టు చేసినట్లు తెలిపారు.

పొన్నూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రభాకర్ మాట్లాడుతూ ఎవరైనా గాని గంజాయి రవాణా,విక్రయిం చటం ,సేవించడం గాని చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గంజాయి డ్రగ్స్ వంటి దుర వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. యువత భవిష్యత్తు నాశనం చేసుకోరాదని ఎవరైనా గంజాయి డ్రగ్స్ సేవిస్తున్నట్లు విక్రయిస్తున్నట్లు రవాణా చేస్తున్నట్టు తెలిస్తే అలాంటి వ్యక్తులపై పోలీస్ డేగ కన్ను వేసి ఉన్నారని కచ్చితంగా ఇలాంటి విషయాలు గురించి సమాచారం తెలిసినప్పుడు పోలీస్ వారికి తెలియజేయాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను కోపంగా ఉంచటం జరుగుతుందని అన్నారు. ప్రజలను యువతను గంజాయి మత్తు లోకి దించి అనేక నేరాలకు పాల్పడుతూ సమాజానికి హాని చేస్తున్న సంఘ విద్రోహులని పై పోలీసులు ఉక్కు పాదం మోపడం జరుగుతుందని అన్నారు.అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. గత నెల రోజులలో సుమారుగా 100 మంది పై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇకపై బహిరంగ

వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని హితవు పలికారు. సందర్భంగా గంజాయి కేసులో నిందితులను పట్టుకోవడానికి తదుపరి దర్యాప్తునకు సహకరించిన చేబ్రోలు ఎస్సైలు కె.ఆనంద్, జి.వెంకటాద్రి , సిబ్బం ది శ్రీనివాసరావు, ఎ.అప్పలనాయుడు, ఎన్.ధర్మ రాజు జి.నాగరాజు, పి.శివనాగరాజు, ఎ.శివకృష్ణ, డబ్ల్యూ పిసి స్వాతి, హోంగార్డు సురేష్‌లను ప్రత్యేకంగా అభినందించారు

మిస్సింగ్ కేసులు నమోదు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్



పొన్నూరు పట్టణం లో ఇటకం పాడు రోడ్డు లోని మహమ్మద్ సల్మాన్ (13) శనివారం సాయంత్రం 4గంటల నుండి ఇంటి నుంచి వెళ్లి పోయాడు ఎంతసేపటికి వెతికినా కనిపించకపోవ డంతో పొన్నూరు అర్బన్ పోలీస్ స్టేషన్లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఎస్సై హసీం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణం ఆల్లూరు కు చెందిన బొందలపటి ప్రసాద్ (41) ఈ నెల 7వ తేదీ నుంచి కనిపించడం లేదని అతని భార్య విజయ చాముండేశ్వరి ఫిర్యాదు మేరకు పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు పొన్నూరు రూరల్ ఎస్సైకు తెలియజేయాల్సిందిగా కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న తిరుపాల్

ఏకీకృత సర్వీసు రూల్స్‌కు సులువైన పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షులు బి.తిరుపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్యాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యకు ఎంతో చాకచక్యంగా పరిష్కారం చూపిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. 25 ఏళ్లుగా ఏకీకృత సర్వీసు రూల్స్ అంశం న్యాయస్థానాల్లో పరిష్కారానికి నోచుకోని కారణంగా, సీనియార్టీ ఉన్నా ఉద్యోగోన్నతులు పొందలేక ఎంతోమంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేయాల్సి వచ్చిందన్నారు. ఉపాధ్యాయ వర్గాలకు మేలు చేసే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఎంఇఒ-2 పోస్టులతో ప్రభుత్వ, జెడ్పీ హెచ్ఎంలకు సమన్యాయం చేసిందన్నారు. ఎంఇఒ-1 పోస్టులను జోనల్ స్థాయిలో ప్రభుత్వ హెచ్ఎంలకు, ఎంఇఒ-2 పోస్టులను జెడ్పీ హెచ్ఎంలకు కేటాయించడం ద్వారా సమస్యకు సులువుగా పరిష్కారాన్ని చూపడంతో పాటు పోస్టులు ఇచ్చిన వెంటనే నియామకాలు పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 74 డీవైఈవో పోస్టుల్లో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రావాల్సిన 37 పోస్టులను ఉద్యోగోన్నతులతో రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి తులసీదాస్, కోశాధికారి రమణయ్య, ఉపాధ్యక్షులు మాల్యాద్రిరెడ్డి, చలపతిరావు, హుస్సేన్, ఉర్దూ డీఐ షేక్ ఎమ్‌డీ ఖాసిం పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక ప్రోత్సాహం అందజేత

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

విట్‌లో చదువుతున్న పొన్నూరుకు చెందిన షేక్ రభియాకు పట్టణంలోని తెలగపాలెం రామమందిరం వద్దగల వివేకానంద ట్రస్ట్ తరుపున రూ.10 వేల ఆర్థిక ప్రోత్సాహకాన్ని ఆదివారం అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.జగదీష్ (శాన్వి టెక్నాలజీస్), సభ్యులు కెవి రమణ, డి.శ్రీనివాసరావు, టీచర్లు ముస్తాక్, కరిముల్లా ముజీర్ పాల్గొన్నారు.

వేద పారా మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

వృత్తి విద్యా కోర్సులతో ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి - పెదకూరపాడు

వృత్తి విద్యా కోర్సులు చేస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని శాసన సభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. నూతనంగా ప్రభుత్వ గుర్తింపు పొందినస్థానిక అమరావతి రోడ్ లోని వేద పారా మెడికల్ కాలేజీని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభకు కళాశాల డైరెక్టర్ సిహెచ్ రమేష్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సింగ్ పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులకు తల్లితండ్రులకు ఆయా కోర్సుల గురించి అవగాహన కల్పించాలన్నారు.హై కోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు మాట్లాడుతూ అతితక్కువ సమయంలో జీవితంలో స్థిరపడే కోర్సులను గ్రామీణ ప్రాంతాలకు చేరువ చేస్తున్న వేద విద్యా సంస్థలను ఆయన అభినందించారు. తరగతి గదులను డాక్టర్ గజ్జెల నాగభూషణ రెడ్డి, ప్రయోగశాలలను పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు ప్రారంభించారు. అనంతరం జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపిపి వీరయ్య, క్రోసూరు యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి ప్రారంభించారు. వైద్యశిబరంలో డాక్టర్ దాసరి రజనీ కాంత్. డాక్టర్ శారదా రెడ్డి, డాక్టర్ జి.రవిశంకర్ రెడ్డి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-నాదెండ్ల

మండలంలోని సాతులూరు సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు సాతులూరు, చందవరం,గొరిజవోలు, డైరీ ఇండస్ట్రీ, పెయింట్ గొడౌన్స్,దొండపాడు, పోనుగుపాడులలోని గృహ, వాణిజ్య, చిన్న, భారీ, పరిశ్రమలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

నిత్యావసర వస్తువుల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలను వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ప్రతి నెలా ఆదుకునే కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఏడు కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలను అందజేశారు. దాతలు సిహెచ్ రాఘువేంద్రరావు , సిహెచ్ భద్రయ్య , సిహెచ్ శంకరరావు, డి.విశ్వనాధ శాస్త్రి, ఎ. గోపాల క్రిష్ణ మూర్తి, ఎ. సుబ్బారావు, కె.సత్యనారాయణ. అనంతరం సుదీర్ఘ కాలంగా సహాయ సహ కారాలు అందిస్తున్న ధూళిపాళ్ళ నాగేశ్వరావు, నారాయణం రామ మోహనరావు లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట ఆదిత్య బ్రాహ్మణ సేవా సమితి, ఆదిత్య బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షులు ఏకామారుతి రామ శర్మ , కార్యదర్శి పోలూరి రామ చంద్ర మౌళి పాల్గొన్నారు.

36 గంటల ధర్నా విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అన్ని జిల్లాల్లో యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టనున్న 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కెపి మెటిల్డాదేవి, గుంటూరు మల్లేశ్వరి పిలుపు నిచ్చారు. స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను నిర్వీ ర్యం చేసే కుట్రలలో భాగంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ లో నిధులు కుదించగా, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ కంటే వేతనాలు ఎక్కువ ఇస్తామని ప్రకటించి అమలు చేయక పోగా మితిమీరిన రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నా రని అన్నారు. 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేయాలని అంగన్వాడీలలో ఉన్న ఒంటరి మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వైఎస్ఆర్ సంపూర్ణ పోషణకు సొంత నిధులు వెచ్చించడం వలన అంగన్వాడీలకు సెంటర్ల నిర్వహణ భారంగా మారిందని చెప్పారు. సామర్థ్యం తక్కువ ఉన్న ఫోన్ లు ఇవ్వడం వలన యాప్ ద్వారా సక్రమంగా పని చేయడం లేదని, దీంతో అంగన్వాడీ లు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని అన్నారు. ఇటువంటి యాప్ లు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్, అంగన్వాడీలకు వేతనంతో కూడిన వారాంతపు సెలవులు, మెడికల్ సెలవులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఇవ్వాలని డిమాండ్ చేశారు. 36 గంటల ధర్నాను నిర్వీ ర్యం చేసే కుట్రలలో భాగంగా సత్తెనపల్లి మండలం లక్కరాజుగార్లపాడుకు ఫుడ్ కమిషన్ అధికారులు వస్తున్నారని, సెలవులు పెట్టేందుకు వీలు లేదని సూపర్ వైజర్లు ఆంక్షలు విధించారని,ఎట్టి పరిస్థితు ల్లోనైనా 36 గంటల ధర్నాను విజయ వంతం చేస్తామని చెప్పారు. సోమవారం ఉదయం పది గంటల కల్లా ధర్నా చౌక్‌కు అంగన్వాడీలు హాజరుకావాలని అక్కడి నుండి ప్రదర్శనగా జిల్లా కలెక్టరేట్ వద్దకు వెళ్లి 36 గంటలు పాటు అక్కడే ధర్నా చేయనున్నట్లు వివరించారు. ఈ మహా ధర్నాలు అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నరసరావుపేట ప్రాజెక్ట్ కార్యదర్శి బి.నిర్మల, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ డి.శివకుమారి పాల్గొన్నారు.

అమరావతికి నేడు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రాక

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో జరిగే వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే నంబూరు. శంకరరావు వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వర రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిధిలోని నరుకుళ్ల పాడు పీఏసీఎస్ లో రైతులకు వ్యవసాయ వంట రుణాలు పంపిణీ చేస్తారని, 10.30 గంటలకు అమరావతిలోని అగ్రికల్చరల్ ఇన్‌పుట్ టెస్టింగ్ లేబొరేటరీని సందర్శిస్తారని తెలిపారు. 11 గంటలకు పొందుగొల వద్ద ఉద్యానవన శాఖ మిరప సెడ్ లింగ్స్ నర్సరీ, డ్రిప్, స్ప్రింక్లర్లకు సంబంధించిన పరికరాలను పంపిణీ, 11.20 గంటలకు జూపూడి రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులకు సీసీఆర్సీ కార్డులు, కంది విత్తనాలను పంపిణీ చేసి రైతులతో ముచ్చటిస్తారని పేర్కొన్నారు. అనంతరం 11.40 గంటలకు అత్తలూరులోని రైతు ఉత్పత్తి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అత్తలూరు అర్గానిక్ వ్యవసాయాన్ని పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడతారని ప్రకటనలో పేర్కొన్నారు.

'పాటల పల్లకిలో' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - వినుకొండ

అభ్యుదయ కవి, జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలా రామ్ రచించిన గేయ సంపుటి 'పాటల పల్లకిలో' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆదివారం స్థానిక సిపిఎం ఆఫీస్ ఆవరణలో జరిగిన సభకు భాగవతుల రవికుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. రవికుమార్ మాట్లాడుతూ కమలా రామ్ తాను నమ్మిన సిద్ధాంతాలను త్రికరణ శుద్ధిగా అనుసరిస్తూ ప్రజలను చైతన్య పరిచే అనేక అభ్యుదయ, భావ గీతాలు రాశారని చెప్పారు. ఆ గేయాల సంకలనమే ఈ

'పాటల పల్లకిలో' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు జివి ఆంజేయులు, రవికుమార్ తదితరులు

పుస్తకమని చెప్పారు. జీవి ఆంజనేయులు మాట్లాడుతూ కమలారామ్ ఎన్నో సుమ ధుర గీతాలు రాసి, ఎన్నో సత్కారాలు పొందారని, సినీ గీతాలు కూడా రాయడం సంతోషకరమని అన్నారు. పుస్తక సమీక్ష చేసిన కవులు దుబ్బల దాసు, యతిశ్రీ, కెజె రమేష్ మాట్లాడుతూ కమలా రామ్ కవితలు చాలా సరళమైన భాషలో, ఆదర్శవంతమైన భావాలతో నిండి ఉన్నాయన్నారు. అనంతరం కమలారామ్ దంపతులను ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో జాన్ సుందర రావు, జి.శ్రీనివాస రావు, పివి సురేష్, జి.రమణ, డాక్టర్ ఎల్ ఎన్ రావు , గుమ్మడి, కూచి రామాంజనేయులు , యుటిఎఫ్ రవి, ఆర్టిస్టు ప్రసాద్, గోపాలుని మధు, భవాని శంకర్, సూరి,సాహిత్య అభిమానులు, కవులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు పరిహారం చెల్లించండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

ఇసుక కొరత, కరోనా సమయంలో మరణించిన భవన నిర్మాణ కార్మికులకు పరిహారం చెల్లించాలని ఎపి బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్తెనపల్లి పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇసుక కొరత కారణంగా అనేక మంది కార్మికులకు పనులు లేక ఆకలితో అలమటించి మరణిం చారని, అలాగే కరోనా సమయంలో కూడా మృతి చెందారని, వారందరికీ పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఖర్చు చేయాల్సిన సంక్షేమ నిధులను ప్రభుత్వం దారిమళ్ళించి కార్మికులకు అన్యాయం చేసిందని అన్నారు. కార్మిక శాఖ ద్వారా. కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అందచేస్తున్న పథకాలను రద్దు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబర్ 1214 తీసుకొచ్చిందని, తక్షణం దీనిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాల అసెంబ్లీలో సమావేశాల్లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ మంత్రి అంబటి రాంబాబు కు సోమవారం వినతిపత్రం

మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు అవ్వారు ప్రసాదరావు

అందజేస్తామని చెప్పారు. లక్కరాజుగార్లపాడు సెంటర్ నుండి ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం అందజేసే కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ సైదా, పట్టణ కార్యదర్శి జి. సాల్మన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్యం.. కొత్త పుంతలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

దంత వైద్యం ఆధునిక కాలంలో కొత్త పుంతలు తొక్కుతోందని ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ గ్రంధి శ్రీనివాసరావు అన్నారు. ఒకప్పుడు దంత సమస్యలకు పరిష్కారాలు దొరికేవి కావని, ప్రస్తుతం పెరిగిన సాంకేతిక పరిజ్ఞానంతో దంత వైద్యంలో పరిష్కారాలు సులువుగా దొరుకుతున్నాయన్నారు. గతంలో బిగించే(ఫిక్స్‌డ్ పద్ధతి) పళ్ళు అమర్చాలంటే పక్క పళ్ళను అరగదీసి వాటికి క్యాపులు తొడిగి వాటి సహాయంతో మధ్యలో పళ్ళు పెట్టే వాళ్లమని చెప్పారు.. రోగికి ఇష్టం లేకపోయినా వేరే పద్ధతి అందుబాటులో లేకపోవడంతో ఒక్కొక్క దవడలో 8 నుంచి10 పళ్ళు కూడా అరగదీయాల్సి వచ్చేదన్నారు. పై పళ్ళు అరగదీసి వాటి సహాయంతో బిగించే వాళ్లమని అన్నారు. అయితే ఇప్పుడు ఇంప్లాంట్ డెంటిస్ట్రీ అభి వృద్ధి చెందిందని, వాటికి సంబంధించిన మెరుగైన పరికరాలు, ల్యాబ్ సౌక ర్యం అవగాహన తదితర ఆధునిక పద్ధతులను అవలం బించడం వల్ల ఇంప్లాట్స్ పద్ధతిలో పళ్ళు



బిగించడంలో విజయం సాధించగలుగుతున్నా మన్నారు. ఈ పద్ధతిలో కొన్ని లేదా మొత్తం పళ్ళు ఊడిపోయిన బిగించుకోవచ్చని, షుగర్ వ్యాధిగ్రస్తు లకే కాకుండా వేరే వేరే వ్యాధులు ఉన్నవారు కూడా ఈ పద్ధతిలో పళ్ళు బిగించుకోవచ్చని చెప్పారు. ఇంప్లాంట్స్ పెట్టేందుకు ముందు అన్ని వైద్య పరీక్షలు చేసిన తర్వాతే పి సైజు ఇంప్లాంట్ ఎక్కడ పెట్టాలి అనే విషయం నిర్ధారించు కుంటామన్నారు. కొన్ని రోజుల వ్యవధి తర్వాత పెట్టిన ఇంప్లాట్స్ యొక్క ఎముకల్లోని పటుత్వాన్ని నిర్ధారించుకుని పళ్ల చట్రాన్ని బిగిస్తామని వివరించారు.

అక్కడికి వెళ్లం.. ఇక్కడే ఉంటాం..

- పట్టణంలోని స్థలాలకే పట్టాలివ్వాలంటున్న నివాసితులు
- పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకుల పర్యటనలో మనోగతం వెల్లడి

నివాసితులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

ప్రజాశక్తి-తాడేపల్లి

40 ఏళ్ల నుంచి ఇళ్లు వేసుకుని నివాసముంటున్న ఈ స్థలాలకు రైల్వేకు పనికిరావు. గత పంచాయతీ నుంచి మున్సిపల్, కార్పొరేషన్ అధికారులు అన్ని రకాల సదుపాయాలు కల్పించాయి. రాజధానిలో ఇచ్చిన సెంటు ఇంటి స్థలం దగ్గరకు మేము వెళ్లడానికి సిద్ధంగా లేము. మేము ఇప్పుడు ఉంటున్న స్థలాలకు పట్టాలిచ్చే విధంగా చూడండి... అని ప్రజలు ఘంటాపథగా చెబుతున్నారు. పట్టణంలోని వెంకయ్యకొట్టు సెంటర్, రన్నింగ్‌రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో రైల్వేకు పనికిరాని స్థలాల్లో ఉంటున్న బాధితుల అభిప్రాయాలు తెలుసుకోవడానికి సిపిఎం బృందం ఈ ప్రాంతంలో పర్యటించింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నగరానికి దగ్గరలో అభివృద్ధి చెందుతున్న తాడేపల్లిలో ఏదో ఒక పని చేసుకుని ఇక్కడ బతుకుతున్నాం. అక్కడకు వెళ్తే మాకున్న జీవనం పోతుంది... అని చెప్పారు. వర్షాకాలం వస్తే అక్కడ మోకాళ్లలోతు నీళ్లలో ఉండే పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం మా బాగోగుల గమనించి ఇక్కడే ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.. అని కోరారు. రాజధాని అమరావతిలో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సెంటు భూమి పట్టాలు ఇచ్చినా తాము ఎక్కడికీ వెళ్లబోమని, ఇక్కడే ఉంటామని ఖరాఖండిగా చెబుతున్నారు.

ఎక్కడున్న వారికి అక్కడే పట్టాలివ్వాలి : సిపిఎం

వెంకయ్యకొట్టు సెంటర్, రన్నింగ్ రూమ్ సెంటర్, కొత్త వడ్డెర కాలనీ, ముగ్గురోడ్డు, పోతురాజుస్వామి గుడి, లంబాడీపేట, సీతానగరం తదితర ప్రాంతాల్లో సుమారు 900 మంది రైల్వే స్థలాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తెలిపారు. వీరు నివాసముంటున్న ప్రాంతాల్లో విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించబడ్డాయని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రాజధానిలో తాడేపల్లి బాధితులదంరికీ సెంటు స్థలం చొప్పున ఇచ్చిందని, ఈ సంతోషం పేదల్లో లేదని తమ పర్యటనలో తేలిందని చెప్పారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలాలు తమకు ఎలా ఇస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారన్నారు. సెంటు భూమిలో ఎలా బతుకుతామని అడుగుతున్నారని అన్నారు. కోళ్లు, గేదెలు మీద ఆధారపడి కొన్ని కుటుంబాలు ఉన్నాయని, వారి జీవనోపాధికి ఇబ్బంది కలిగేలా ఉందని తెలిపారు. కృష్ణుని గుడి వద్ద గల సచివాలయానికి రాయభార కార్యక్రమంతో పాటు ప్రజలందరితో అర్జీలు ఇచ్చే కార్యక్రమం బుధవారం నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు జి.సుబ్బారెడ్డి, కె.కరుణాకరరావు, ఎస్.ముత్యాలరావు, డి.విజయ్‌బాబు, బాబురావు పాల్గొన్నారు.

ఇదీ జనం మాట..

ప్రస్తుతం మేము ఉంటున్న స్థలంలోనే ఉంటాం. ప్రభుత్వం ఆ విధంగా చర్యలు తీసుకోవాలి. ఏళ్ల నుంచి ఉంటున్నాం. ఇప్పుడు సెంటు స్థలం ఇచ్చి వెళ్లమంటే వెళ్లలేం. మేము ఇప్పుడు ఉంటున్న స్థలాలకే పట్టాలివ్వాలి.

బేతపూడి జయలక్ష్మి

అసలైన పేదలకు కూడా ఇంజినీర్లకు కూడా రాజధానిలో స్థలం ఇచ్చారు. ఉన్నోడికి ఇచ్చి లేనోడికి ఎగొట్టారు. సెంటు భూమి కాకుండా రెండు సెంట్లు ఇవ్వాలి.

దోమతోటి జయమ్మ

పేదలకు ఇచ్చిన స్థలం సిఎం బాత్రూమ్ అంత ఉండదు. మాకు అసలు స్థలం ఇవ్వలేదు. బిడ్డ చదువుకోవడానికి స్కాలర్‌షిప్ రాలేదు. 45 సంవత్సరాలు దాటిన మహిళకు పింఛను అన్నారు అదీ రాలేదు.

నన్నం వెంకటమ్మ

ప్రభుత్వం పేదలకు ఇచ్చిన స్థలాలు బాగా లోతులో ఉన్నాయి. వర్షం వస్తే మోకాళ్లలోతు నీరు నిలబడుతుంది. అక్కడకు వెళ్తే పిల్లలు చదువుకోవడానికి వసతులు లేవు.

ఓర్సు వెంకటేశ్వరరావు

మీరు గొయ్యి తీస్తే మేము బాగు చేస్తాం

మరమ్మతులపై అధికారుల వింత సమాధానం

వడ్డెర కాలనీ క్వారీ తాగునీరు అందక ఇక్కట్లు

ప్రజాశక్తి-తాడేపల్లి

పట్టణంలోని వడ్డెర కాలనీ క్వారీకి వెళ్లే సమీపంలో పబ్లిక్ కుళాయికి సంబంధించి పైపు ఊడిపోయి ఆ ప్రాంతంలోని సుమారు 20 కుటుంబాలకు తాగునీరు అందడంలేదు. నాలుగు రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొంది. దీనిపై మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారులను సంప్రదించగా పాడైపోయిన పైప్‌లైన్ దగ్గర మీరే గొయ్యి తీసుకోవాలని అప్పుడు తాము వచ్చి పైపులు బిగిస్తామని చెబుతున్నట్లు స్థానికులు అంటున్నారు. ఇంటి పన్నులు పెద్దఎత్తున పెంచి వసూలు చేస్తున్న కార్పొరేషన్ అధికారులు పబ్లిక్ కుళాయి పాడైపోతే బాగు చేయరా అని ప్రశ్నిస్తున్నారు. పాడైపోయిన పైపును సిపిఎం బృందం ఆదివారం పరిశీలించింది. ఇంజినీరింగ్ అధికారులు వెంటనే స్పందించి పైప్‌లైన్ బాగు చేసి నీటి సరఫరాకు

చర్యలు తీసుకోవాలని జిల్లా కార్యదర్శి పాశం రామారావు, పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు కోరారు.

తిష్టేసిన సమస్యలను పరిష్కరించండి

- సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు
- మంగళగిరి నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-తాడేపల్లి

మంగళగిరి నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలను స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకుని వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మంగళగిరి నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక మేకా అమరారెడ్డి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ మంగళగిరి పట్టణ, రూరల్ ప్రాంతాల్లో అనేక సమస్యలు తిష్ట వేశాయన్నారు. నియోజకవర్గంలో సుమారు 20 వేల మంది వివిధ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు వేసుకుని నివాసం ఉంటున్నారని, వారందరికీ ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు వారు నివశిస్తున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనేక ప్రాంతాల్లో శ్మశాన స్థలాలు లేవని, ఉన్నచోట అభివృద్ధి చేయాలని కోరారు. తాడేపల్లి మంగళగిరి ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. సిఎం నివాసముంటున్న తాడేపల్లిలో డబుల్ లైన్ బ్రిడ్జి ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గంలో ట్రాఫిక్ పెరిగినందున ప్రమాదాల నివారణకు ఎక్కడికక్కడ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్పొరేషన్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని, అస్తవ్యస్తంగా ఉన్న తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇండోర్ స్టేడియంతోపాటు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, ఐటిఐ కళాశాలల ఏర్పాటు చేయాలని కోరారు. తాడేపల్లి రూరల్ గ్రామాల్లో ఇసుక క్వారీలు తెరిచి వందలాది మందికి ఉపాధి కల్పించాలన్నారు. తాడేపల్లి కొండ చుట్టూ ఉన్న ప్రాంతంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్ పనులను వెంటనే అనుమతించాలన్నారు. మూడు రాజధానుల మాట వెనక్కి తీసుకుని అమరావతే ఏకైన రాజధాని అని సిఎం ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇ.అప్పారావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, నాయకులు బి.కోటేశ్వరి, ఇ.సుబ్బారెడ్డి, వి.దుర్గారావు, ఎం.భాగ్యరాజు, బాలరాజు పాల్గొన్నారు.

కళాకారులకు పాటల శిక్షణ

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో జరిగిన పాటల శిక్షణా శిబిరం ముగిసింది. ఆదివారం రాత్రి తాడేపల్లి బోసుబొమ్మ సెంటర్‌లో కళాకారులు పాటల ప్రదర్శన నిర్వహించారు. కాజ గ్రామంలోనూ ఆదివారం కళాకారులకు నృత్యాలు నేర్పించారు. నృత్య దర్శకులు రవితేజ కళాకారులకు శిక్షణ ఇచ్చారు. తాడేపల్లిలో జరిగిన కార్యక్రమంలో పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్, ఉపాధ్యక్షులు గాదె సుబ్బారెడ్డి, కె.కరుణాకరరావు, ఆర్‌వి రాఘవయ్య, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

182 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సహకారంతో మంగళగిరి పట్టణంలోని పద్మశాలీయ కళ్యాణ మండపంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్స్ నేతత్వంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్య సేవలు అందించారు. శిబిరంలో మొత్తం 182 మంది పరీక్షలు చేయించుకోగా వీరిలో మహిళలు 84 మంది, పురుషులు 98 మంది ఉన్నారు. అత్యాధునికమైన క్యాప్సియర్, మమోగ్రఫీ, అల్ట్రాసౌండ్, సోనోగ్రఫీ, పాప్‌స్మెర్, థైరాయిడ్, ఎక్స్-రే, బీపీ, జనరల్ చెకప్‌లను చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి వైద్యం అందించాలనే లక్ష్యంతో ఉచిత ఆరోగ్య సంజీవని కేంద్రాలు, ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరాలను నారా లోకేశ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎంతోమంది పేదలు ఆర్థిక స్థోమత లేక ఖరీదైన క్యాన్సర్ టెస్టులు చేయించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం 16 మంది వైద్య బృందంతో క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో టి.జానకీదేవి, డి.రాజు, జి.దుర్గారావు, షేక్ రియాజ్, యు.శ్రీమన్నారాయణ, ఎ.జయసత్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

12న రోప్ స్కిప్పింగ్ జిల్లా ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అమరావతి రోడ్డు, ఆంజనేయపేట 2వ లైనులోని విజేత విద్యాలయ స్కూల్ క్రీడా మైదానంలో ఈనెల 12న జిల్లా రోప్ స్కిప్పింగ్ జట్ల కోసం ఎంపికలు ఉంటాయని జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10, 12, 14, 17 11, 19 ఏళ్ల విభాగాల్లో బాల, బాలికలకు ఎంపికలుంటాయని, ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లకు ఎంపిక చేసి, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఫొటో, ఆధార్‌తోపాటు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి, నేరుగా హాజరు కావచ్చని, వివరాలకు 8247565411, 9154497458 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ముస్లిమ్ మైనారిటీలను దగా చేసిన వైసిపి

పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జివి ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

తెలుగుదేశం పార్టీ హయాంలో మైనారిటీల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రవేశపెట్టిన పథకాలను నేటి వైసిపి ప్రభుత్వం రద్దుచేసి దగా చేసిందని పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు జీవీ ఆంజనేయులు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి నేతల అండతో రాష్ట్రవ్యాప్తంగా మైనారిటీలపై దాడులు పెరిగాయని తప్పుడు కేసులు బనాయించి వేధింపులకు గురి చేయడమ కాక ఆత్మహత్యలకు ప్రేరేపించి దుర్మార్గాలకు పాల్పడ్డారని ఆరోపించారు. వైసీపీ నాయకుడు కుమార్తె కంటే ముస్లిం మైనారిటీ బాలిక మిస్స ఉన్నతిగా చదివినందుకు వేధింపులకు గురి చేసి బయటకు పంపడంతో మైనారిటీ బాలిక కలత చెంది ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఎంతో మంది మైనారిటీ బాలికలపై అత్యాచారానికి పాల్పడుతుంటే ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ పాలనలో విదేశీ విద్య తొలగించారని విమర్శించారు. ఈ నెల 13వ తేదీన నరసరావుపేట పట్టణంలో జరగబోయే జిల్లా మైనార్టీ సెల్ అనుబంధ కమిటీ సమావేశానికి ముస్లింలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో షేక్ జలీల్, మహబూబ్ పత్తేశా, కొండ్రముట్ల సుబా, దస్తగిరి, ఖాసిం, జానీ పాల్గొన్నారు.

ఎన్నారై లో ముగిసిన వర్క్ షాప్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్

హాండ్స్ ఆన్ ఎసెన్స్ ఆఫ్ ఎయిర్ వే, అడ్వాన్స్ కార్డియాక్ లైఫ్ సపోర్ట్ అంశంపై ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ఃలోని ధన్వంతరి లెక్చర్ గ్యాలరీలో ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌ను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రభోద్ మాట్లాడుతూ వైద్య విభాగంలో ఎమర్జెన్సీ మెడిసిన్ ప్రధాన భూమిక పోషిస్తుందని తెలిపారు. దాదాపు 200 మంది యుజి, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్న ఈ వర్క్ షాప్‌లో ప్రధానంగా వెంటిలేటర్ వైద్య సేవలపై, గుండె ఆగిన సమయంలో సీపీఆర్ చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. జనరల్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాల్లో అత్యాధునికమైన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సురేంద్ర, డాక్టర్ ప్రణవ్, డాక్టర్ ఫవాజ్, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ చరిత, డాక్టర్ సుసత, డాక్టర్ సాయిబాబు, ఎమర్జెన్సీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పుల్లారావు పరామర్శ

ప్రజాశక్తి-నాదెండ్ల

పల్నాడు జిల్లా బీసీ నాయకులు వలివేటి శ్రీనివాసరావు తల్లి వలివేటి వెంకాయమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాతులూరిలోని శ్రీని వాసరావు ఇంటికి ఆదివారం వారింటికి తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు వెళ్లి పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నియోజకవర్గ సమన్వయకర్త ఎన్.సదాశివరావు, నాదెండ్ల మండలం అధ్యక్షులు బి.సత్యనారాయణ, చిలక లూరిపేట రూరల్ మండలం అధ్యక్షులు జె.మదన్ మోహన్ , శ్రీనివాస రావులు నివాళులర్పించారు.

సంచులొస్తాయా? 'సంపూర్ణ పోషణ' అందుతుందా?

- గర్భిణులు, బాలింతలకు అందని సంపూర్ణ పోషణ పౌష్టికాహార పథకం
- సంచులు లేకపోతే సరుకులు ఇవ్వడానికేమైందనే విమర్శలు
- కరోనా తర్వాత పూర్తిస్థాయిలో అమలవ్వని పథకం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఎన్.టి.ఆర్ సంపూర్ణ పోషణ పౌష్టికాహార పథకం పేరును మార్చి ప్రస్తుత ప్రభుత్వం వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పౌష్టికాహారం పథకంగా చేసి ఎంతో ఆర్భాటంగా కొంత కాలం అమలు పరిచారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార లోపాలు లేకుండా ఉండాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. అయితే, కరోనా సమయంలో ఈ పథకాన్ని నిలిపివేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తిరిగి పూర్తి స్థాయిలో అమలు కాలేదు. మండలంలో ఎక్కడో కొన్ని చోట్ల ఈ పథకం కిందు సరుకులు ఇస్తున్నారు. ఈ ఏడాది జులై 1 నుంచి గర్భిణులకు, బాలింతలకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ పౌష్టి కాహార సరుకులు ఇంటికే ఇస్తామని కొన్ని నెలలుగా ప్రకటనలతో ఊదరగొట్టారు. తీరా గడువు సమీపించే సరికి ప్రణాళికలో కొన్ని లోపాల వల్ల టేక్ హోమ్ రేషన్ పద్ధతి వాయిదా పడి నట్లు ఐసిడిఎస్ అధికారులు చెబుతున్నారు. సంచులు లేక పౌష్టికాహార సరుకులను పంపిణీ చేయలేదంటున్నారు. సంచుల తయారీలో జాప్యం కారణంగా వాటితో పాటు సరుకులు కూడా ఆయా కేంద్రాలకు చేరలేదని అంటున్నారు. సంచులు లేవని, సరుకులు రాలేదని వారు చెబుతుండటంపై గర్భిణులు, బాలింతలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు, ఈ పథకం తిరిగి పూర్తి స్థాయిలో అమలు చేస్తారో లేదో అని అంటున్నారు.సంచులు లేకపోతే ఏమైంది సరుకులు ఇచ్చేందుకని ప్రశ్నిస్తున్నారు.ఈ పథకం కింద మూడు కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, అర కిలో పామా యిల్, 25 కోడి గుడ్లు, ఐదు లీటర్ల పాలు, రెండు కిలోల రాగి పిండి, 250 గ్రాము ల చిక్కీలు, ఒక కిలో అటుకులు, 250 గ్రాములు ఖర్జూరాలు కలిపి ఒక సంచిలో పెట్టి గర్భిణులకు, బాలిం తలకు ఇవ్వాలి. గర్భిణులకు మూడో నెల నుంచి, బాలింతలకు 6 ఆరు నెలల వరకు ఈ పథకం కింద సరుకులు ఇస్తారు.

నియోజకవర్గంలో మొత్తం అంగన్వాడి కేంద్రాలు 267. గడచిన జూన్ నెలలో యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట మండలాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో సగటున గర్భిణులు, బాలింతల సంఖ్య ఈవిధంగా ఉన్నట్లు సమాచారం. యడ్లపాడు మండలంలో 61 అంగన్వాడీ కేంద్రాలు ఉండగా, బాలింతల సంఖ్య 268, గర్భిణుల సంఖ్య 342. నాదెండ్ల మండలంలో 86 కేంద్రాలు ఉన్నాయి. అందులో బాలింతల సంఖ్య 303,గర్భిణుల సంఖ్య 399. చిలకలూరిపేట పట్టణ పరిధిలో 43 కేంద్రాలు ఉన్నాయి. బాలింతల సంఖ్య 502, గర్భిణులు 370. మండలంలో సుమారు 77 కేంద్రాల పరిధిలో 23 గ్రామాలు ఉన్నాయి. అందులో బాలింతల సంఖ్య 402 , గర్భిణుల సంఖ్య 257.

15 తర్వాత సరుకులు అందజేస్తాం

ఈ నెల 15వ తేదీ తర్వాత ఈ పథకం కింద సరుకులు ఇచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతు న్నాయని సిడిపిఒ శాంతకుమారి చెప్పారు. అన్ని సరుకులు ప్రధాన కేంద్రాలకు వస్తున్నాయని, సంచులు రాకపోతే ఇంటింటికీ చేర్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు.

కార్మికుల న్యాయబద్ధమైన కోర్కెలు తీర్చండి

ప్రజాశక్తి- మేడికొండూరు

కంపెనీ ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

మండలంలోని పేరేచర్ల నికో ఆగ్రో ఆయిల్ కంపెనీలో కార్మికుల నిరసన ఆదివారం 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా మండల సిఐటియు నాయ కులు ఎస్ఎం బాషా మాట్లాడుతూ కంపెనీలో పనిచేసే కార్మికుల న్యాయబద్ధమైన కోరికలు యజమాన్యం తీర్చేందుకు ముందుకు రావాలని అన్నారు. గత మూడు దశాబ్దాలుగా ఇంక్రిమెంట్లు పెంచకుండా యాజమాన్యం తాత్సారం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఆర్.శ్రీకాంత్, షేక్ మీరా సాహెబ్, కె వీరరాజు, ఈ అబ్దుల్లా, కె.శ్రీనివాస్ రెడ్డి, ఆర్ రాంబాబు, ఎస్ఎం బాషా తదితరులు పాల్గొన్నారు.

గంట కొట్టదు .. సైరన్ మోగదు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

చిలకలూరిపేటలోని గడియారం స్తంభంలో పనిచేయని గడియారాలు, పార్కులో ఉన్న మోగని సైరన్

చిలకలూరిపేట అంటే గుర్తుకు వచ్చేది గడియార స్తంభం, గాంధీ పార్కులో మోగే సైరన్. ప్రస్తుతం ఇవి రెండూ కూడా పనిచేయడం లేదు. పట్టణానికి ఈ గడియారం స్తంభం, గాంధీ పార్కులో ఉన్న సైరన్ రెండూ పోగాకు, వ్యవసాయ కార్మికులకు, కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు సమ యాన్ని గుర్తు చేస్తూ ఉంటాయి. సైరన్ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు భోజన సమయం, సాయంత్రం 5 గంటలకు పని ముగిసే సమయంలో ఇది మోగుతుంది. సుమారు 18 కిలోమీటర్ల మేరకు ఈ సైరన్ వినబడుతుంది.చిలకలూరిపేట గ్రామ పంచాయతీగా ఉన్న రోజుల్లోనే మైలవరపు గుండయ్య సుమారు 1965 నుంచి1969 మధ్య సంవత్సరాల్లో దీనిని నిర్మించారు. ఈ గడియార స్తంభానికి ఉన్న నాలుగు గడియారాల్లో ఏ ఒక్కటీ పని చేయక దాదాపు సం వత్సరం కావస్తోంది. ఈ గడియార స్తంభం చుట్టూ ఉన్న హద్దు గోడలు కూడా పడిపోయాయి. ఈ నేపథ్యంలో సిపిఎం పట్టణ కమిటీ కార్యదర్శి పేరు బోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, చిలకలూరిపేటలో ఐకాన్‌గా ఉన్న ఈ గడియార స్తంభానికి ఈ దుస్థితి పట్టిందని విమర్శించారు. కాలక్రమంలో పార్కుని తాకట్టు పెట్టి మున్సిపాల్టీ వారు అక్కడి సైరన్ గాలికొదిలేశారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పడిపోయిన గడియార స్తంభం హద్దు గోడలను, నాలుగు వైపు చెడిపోయి ఉన్న గడియారాలను, వాటి తలుపులను బాగుచేయించాలని కోరారు. గడియార స్తంభం చుట్టూ బాగు చేయించి, పూల మొక్కలు వేసి, వాటర్ ఫాల్స్‌తో, విద్యుత్ దీపాలతో ఉండేలా చూడాలని అభిప్రాయపడ్డారు.

బీసీలపై టిడిపిది కపట ప్రేమ

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

బీసీలపై కపట ప్రేమ చూపుతూ ఓటు బ్యాంక్ గా వాడుకునేందుకు టిడిపి వ్యవహరిస్తోందని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య విమర్శించారు. స్థానిక ప్రకాష్ నగర్ లోని భువనచంద్ర టౌన్ హాల్ లో ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఉన్న బీసీ అభ్యర్థికి టికెట్ విషయంలో స్పష్టత ఇవ్వకుండా తమ సామాజిక వర్గానికి చెందిన వారికే చంద్రబాబు నాయుడు టిక్కెట్ కట్టబెట్టేందుకు యత్నిస్తున్నారని ఇది బీసీలకు ద్రోహం చేయడం కాదా అని ప్రశ్నించారు.

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ 2014 లో బీసీలకు 114 వాగ్దానాలు చేసిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందులో 10 శాతం కూడా అమలు చేయకుండా దగా చేశారని విమ ర్శించారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి మాట కూడా నిలబెట్టుకున్న నేపథ్యంలో బిసి లు అధిక సంఖ్యలో వైసిపి వైపు చేరి వెన్నుముక అయ్యారన్నారు. అనంతరం ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ సునీత, ఎమ్మెల్సీ యేసు రత్నం, దేవెల్ల రేవతి, నాగార్జున యాదవ్, కృష్ణ బలిజ చైర్మన్ భవాని, పురుషోత్తం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు గూడూరు నాని, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, మరియు బీ.సీ సంఘాల, జిల్లా బిసి ముఖ్య నేతలు ప్రసంగించారు.

ప్రాణాలు తీస్తున్న రహదార్లు

- అధ్వానంగా నందివెలుగు - గుంటూరు ఆర్అండ్‌బి రోడ్డు
- నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న ద్విచక్రవాహన చోదకులు
- పలుమురు మృతి చెందినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ఖాజీపేట కూడలిలో రోడ్డు దుస్థితి

ప్రజాశక్తి-తెనాలి

ఆర్అండ్‌బి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. నడిరోడ్డుపై గుంతలు పడి ప్రమాదాలను శంకిస్తున్నాయి. ద్విచక్రవాహన చోదకులు, ఆటోలు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవటంలేదు. దీనికి తోడు భారీ వర్షాలతో రోడ్లు మరింత ప్రమాదభరితంగా తయారయ్యాయి. నందివెలుగు-గుంటూరు మార్గంలో ప్రధాన రహదారి దుస్థితి ప్రయాణికులను బయపెడుతోంది.

కొలకలూరు మెయిన్ సెంటర్‌లో గోతులు పడిన రోడ్డు

నందివెలుగు- గుంటూరు మార్గంలో గుంటూరు ఆర్అండ్‌బి పరిధిలో గుంటూరు నుంచి వెంకటకృష్ణాపురం వరకూ రోడ్డు బాగానే ఉంది. కాని తెనాలి ఆర్అండ్‌బి పరిధిలో జాకీర్‌హుస్సేన్ నగర్ నుంచి కొలకలూరు వరకూ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. ఈ మార్గంలో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. కొల్లిపర, హనుమాన్‌పాలెం, దుగ్గిరాల, నందివెలుగు, తెనాలి ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులు, ఇసుక టిప్పర్లు, ఇటుక రాయి లోడు లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు, వివిధ విద్యా సంస్థలకు వాహనాలు నిత్యం వేలకొలది ప్రయాణిస్తుంటాయి. ఈ మార్గంలో దీర్ఘకాలికంగా రోడ్డు నిర్మాణానికి గాని, మరమ్మతులగాని నోచుకోలేదు. ఏదైనా ప్యాచ్ వర్కులు చేసినా చేశామనే పేరుకేగాని, ఏ మాత్రం ప్రయోజనం లేదు. దీంతో కొన్నిచోట్ల రోడ్డు ఇరువైపులా కుంగిపోతే, మరి కొన్నిచోట్ల నడిరోడ్డుపై గోతులు పడ్డాయి.

తెనాలి ఆర్అండ్‌బి పరిధిలోని జాకీర్ హుస్సేన్ నగర్ నుంచి కొలకలూరు వంతెన వరకూ రోడ్డు పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. హాఫ్‌పేట-ఖాజీపేట గ్రామాల మధ్య రోడ్డు ఇరువైపులా కుంగి పోయింది. ఆటోలు, బస్సుల్లో ప్రయాణీకుల ఒళ్లు హూనం కావాల్సిందే. ఖాజీపేట మెయిన్ సెంటర్లో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. గతంలో ఇదే పరిస్థితి ఎదురైనపుడు అధికారులు స్పందించకపోవటంతో గ్రామస్తులు ఆ గోతుల్లో డస్ట్ పోయించారు. వర్షాలకు డస్ట్ కొట్టుకుపోయి తిరిగి గోతులమయమైంది. కొలకలూరు పిహెచ్‌సి, కోనేటిపురం సెంటర్ మధ్య మెయిన్ రోడ్డుపై ఓ కల్వర్టు కుంగి పోయింది. నడిరోడ్డుపై ప్రమాదకరమైన గోతులు ఏర్పడ్డాయి. వాహనాలు ప్రమాదాల భారిన పడకుండా గోతులను గుర్తించేందుకు స్థానికులు ఓ ఇసుక గోతాంలో కర్రని నిలబెట్టారు. గతంలో ఇదే ప్రాంతంలో కొల్లిపర మండలం పిడపర్రుకు చెందిన పెయింట్ వర్కర్ బైక్‌పై వెళుతూ వాహనం గోతిలో దిగటంతో అదుపుతప్పి

పిహెచ్‌సి-కోనేటిపురం మధ్య కల్వర్టు కుంగి గోతులు పడిన ప్రాంతం

పడిపోయాడు. తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతూ మృతిచెందాడు కూడా.

గ్రామ ప్రదాన కూడలిలో పెద్ద పెద్ద గోతులు పడ్డాయి. వర్షానికి గోతులు మరింత ప్రమాదకరంగా తయారయ్యాయి. సినిమాహాల్ సెంటర్, పెద్దకాలువ వంతెనపై కూడా ఇదే పరిస్థితి నెలకొంది. దాదాపు ఏడెనిమిది నెలల క్రితం నందివెలుగులో ఓ హొటల్‌లో పనిచేస్తున్న వ్యక్తి స్కూటర్‌పై వెళుతూ, కొలకలూరు వంతెనపై ఉన్న గోతిలో పడి వాహనం అదుపుతప్పటంతో గాయాలపాలై మృతి చెందాడు. రోడ్లు ఎంత ప్రమాదభరితంగా ఉన్నా ఆర్ అండ్ బి అధికారులకు మాత్రం చీమకు ట్టినట్టు కూడా ఉండదు. నిత్యం ఇదే మార్గంలో తిరిగే ప్రజాప్రతినిధులు కూడా రోడ్డు మరమ్మతులపై స్పందించరు. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టరు. ఇంకా ఎన్ని ప్రమాదాలు జరగాలో, ఎంత మంది ప్రాణాలు పోతే అధికారులు స్పందిస్తారో? అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు నిర్మాణానికిగాని, మరమ్మతులకుగాని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టెండర్ల దశలో ఉంది

నందివెలుగు-గుంటూరు మార్గంలో ప్రధానంగా రెండు మూడు చోట్ల రోడ్డు బాగా దెబ్బతిన్న మాట వాస్తవమే. అయిదే రోడ్డు ప్యాచ్ వర్కులు చేసి, దానిపై ఒక లేయర్ వేసేందుకు రూ.3.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దానికి సంబంధించి పనులు టెండరు దశలో ఉన్నాయి. సాధ్యమైనంత త్వరగా టెండర్లు ఫైనల్ చేసి, రోడ్డు పనులు చేపడతాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

నాగేశ్వరరావు, డిఇ, ఆర్అండ్‌బి, తెనాలి

చేనేత వస్త్ర వ్యాపారులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ధర్మవరానికి చెందిన చేనేత వస్త్ర వ్యాపారులైన శశి, ఆనందపై విజయవాడకు చెందిన అవినాష్ గుప్తా దాడి చేయడాన్ని బీసీ సంక్షేమ సంఘం ఖండించింది. ఈ మేరకు సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆదివారం మంగళగిరి బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కార్యాల యంలో విలేకర్లతో మాట్లాడారు. నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావే శంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కె.స్వాతి, యు.శ్రీని వాసరావు, జె.రామాంజనేయులు, ఎం.సత్యనారాయణ, పద్మశాలి సంఘం నాయకులు డి.మోహన్ పాల్గొన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న నాయకులు

ప్రమాదాల నెలవుగా టిడ్కో కూడలి

- నెలలో నాలుగు ఘటనలు
- స్పీడ్ బ్రేకర్ల కోసం విన్నవించినా పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రభుత్వం నిర్మించిన టిడ్కో గృహల ప్రధాన సెంటర్ నాలుగు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. టిడ్కో ఇళ్లకు సమీపంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఉండటంతో వాటిలో పని చేసే కొంత మంది ఉద్యోగులు టిడ్కో గృహాల సమీపంలో నివాసం ఉండటంతో పాటు, టిడ్కో గృహాల్లో సుమారుగా 5 వేలు పైగా జనాభా ఉండటంతో నిత్యం వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు వేగంగా వస్తున్న వాహనాలు వల్ల తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి.

ఇటీవల టిడ్కో గృహాల సముదాయం నాలుగు రోడ్డుల ప్రధాన కూడలిలో లోడుతో వస్తున్న టెంపో ఆటో, స్కూల్ పిల్లల్ని ఎక్కించుకొన్న ఆటో వేగంగా వస్తూ ఒకదానికి ఒకటి ఢీ కొన్నాయి. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో పాటు రెండు ఆటోలు

దెబ్బతిన్నాయి. గతంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో ద్విచక్ర వాహనదారుడికి గాయాలు అవ్వడంతో పాటు బైక్, కారు దెబ్బ తిన్నాయి. మూడ్రోజుల క్రితం కూడా రోడ్డు మీద సైకిల్ తొక్కుతూ ఉన్న బాలుడిని స్కూటీ మీద వేగంగా వెళ్తున్న ఇద్దరు యువకులు ఢీ కొట్టారు. ఈ విధంగా నెలలో కనీసం నాలుగు ప్రమాదాలైన జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

మంగళగిరిలో టిడ్కో ఇళ్లతోపాటు చుట్టుపక్కల కూడా జనాభా పెరిగింది. ఇందుకు అనుగుణంగానే వాహనాల రద్దీ పెరుగుతోంది. నిత్యం తిరిగే ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు అప్పుడప్పుడు కారులు కూడా అతి వేగంగా తిరుగుతున్నాయని స్థానికులు చెపుతున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వృద్ధులు, విద్యార్థులు, చిన్నారులు నాలుగు రోడ్ల కూడళ్ల వద్ద భయభయంగా ప్రయాణించాల్సి వస్తోంది. వాహనాల వేగ నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు వేయాలని గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రాణాలకు ముప్పు రాకముందు అధికారులు మేల్కొనాలని కోరుతున్నారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు వైఎస్సార్ స్మారక పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

ప్రముఖ కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావు వైఎస్సార్ స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన పున్నమి తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల స్థాయిలో వచన కవితలను ఆహ్వానించింది. ఆళ్ల నాగేశ్వరరావు 'చిరస్మరణీయుడు వైఎస్సార్' శీర్షికన పంపిన కవితకు వైఎస్సార్ స్మారక పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పున్నమి దినపత్రిక ప్రతినిధులు ఆన్‌లైన్‌లో పంపిన పురస్కారాన్ని నాగేశ్వరరావు ఆదివారం అందుకున్నట్లు తెలిపారు. వృత్తి రీత్యా ఆర్టీసీ గుంటూరు-2 డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు ఇప్పటికి అనేక పురస్కారాలను అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులతోపాటు డిపో సిబ్బంది ఆయనను అభినందించారు.

పెళ్లి కానుక అందుకుంటున్న వధువు షకీల

ఆలపాటి పెళ్లి కానుక అందజేత

ప్రజాశక్తి - తెనాలి

యువతి వివాహ మహోత్సవం సందర్భంగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రకటించిన పెళ్లి కానుకను స్థానిక నాయకులు అందించారు. నియోజకవర్గంలో పేద కుటుంబాలకు చెందిన యువతీ యువకుల వివాహాల సందర్భంగా వారి ఆచార వ్యవహారాలకు అనుగుణంగా పెళ్లి కానుక పంపిణీ చేయనున్నట్లు ఆలపాటి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణంలోని 18వ వార్డుకు చెందిన షేక్ షకీల వివాహాన్ని పురస్కరించుకుని ఆలపాటి సిద్ధం చేసిన బంగారపు ఉంగరాన్ని ఆ వార్డుకు చెందిన పార్టీ నాయకులు ఆదివారం అందించారు.

బల్లలను ప్రారంభిస్తున్న మాణిక్యరావు, పాపారావు తదితరులు

పెద్దల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

పెద్దలను యువత మననం చేసుకుంటూ వారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు చేయాలని దళిత నాయకులు మూల్పురి మాణిక్యరావు అన్నారు. మండలంలోని నడింపాలెం ఎస్సీ కాలనీలో మందా రాములు జ్ఞాపకార్థంగా వారి కుటుంభ సభ్యులు 11 సిమెంట్ బల్లలను ఏర్పాటు చేయగా వాటిని మాణిక్యరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందా పాపారావు ఉద్యోగం చేసుకుంటూనే తన గ్రామ అభివృద్ధి కోసం కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి పూనుకున్నారన్నారు. పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజావలి మాట్లాడుతూ నిత్యం పనులు చేసుకునే జనం సాయంత్రానికి ఇళ్లకు వచ్చి కొద్దిసేపు సేదదీరడానికి ఈ బల్లులు బాగా ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం గ్రామానికి రాష్ట్ర స్థాయిలో అవార్డు వచ్చినందుకు పంచాయతీ కార్యదర్శిని సత్కరించారు. కార్యక్రమంలో గనికపూడి విఆర్ఒ కోటేశ్వరరావు, రిటైర్డ్ ఫైర్ డిపార్ట్మెంట్ ఆఫీసర్ ప్రసాద్, పాస్టర్ సల్మాన్ రాజ్, మందా రవి, ఎస్ఎఫ్ఐ మండల మండల కార్యదర్శి భరత్‌చంద్ర, అర్జున్‌రావు, సిద్దెల సౌలురాజ్ పాల్గొన్నారు.

కారెంపూడి అడవిలో కోటి విత్తనాలు

నల్లమల అటవీ ప్రాంతంలో నాటే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్

ప్రజాశక్తి - కారెంపూడి

పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందిరపైనా ఉందని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. ప్రకృతి ప్రియుడు కొమెర అంకారావు (జాజి) ఏర్పాటు చేసిన కోటి విత్తనాలు నాటే కార్యక్రమాన్ని మండల కేంద్రమైన కారెంపూడిలోని మంత్రాలయం గుడి వద్ద గల నల్లమల్ల అటవీ ప్రాంతంలో ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలపై కొమెర అంకారావు అధ్యయనం చేసి వాటి గురించి విద్యార్థులకు వివరించడం, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు. ఒకేసారి కోటి విత్తనాలు నాటడం అనే కార్యక్రమం ఎంతో కష్టమైందే అయినా కొమెర అంకారావు కృషితో అది సాధ్యమైందని చెప్పారు. అడవిలో ఉండే ప్రతిఒక్క మొక్కా ఔషధ గుణాలు కలిగి ఉంటుందని అన్నారు. మనకు తెలియని విషయాలు కూడా అంకారావు తెలుసుకొని భావితరాలకు మొక్కల గురించి చాటి చెప్పాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం, అందులో తాను భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని చెప్పారు. అనంతరం పర్యావరణం - మొక్కల పెంపకంపై కస్తూర్బా పాఠశాల విద్యార్థినులతో కలెక్టర్ కొద్దిసేపు మాట్లాడారు. కొమెర అంకారావుతో కలిసి నల్లమల అడవి ప్రాంతంలో విత్తనాలను చల్లారు. అవసరమైన ఆహార విత్తనాలను కూడా చల్లారు. అంకారావును కలెక్టర్ శివశంకర్ సత్కరించి ఆయన ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడి రూ.50 నగదును అందించారు. తొలుత పిహెచ్‌సిలో అదనపు బ్లాక్ యూనిట్ నిర్మాణానికి స్థలాన్ని కలెక్టర్ పరిశీలించి స్థల కేటాయింపుపై తహశీల్దార్ శ్రీనివాస్ యాదవ్‌తో మాట్లాడారు. కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి షఫీ, ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, పిహెచ్‌సి వైద్యాధికారి దుర్గరావు, పంచాయతీ విస్తరణ అధికారి సత్యప్రసాద్, సిఐ డి.జయకుమార్, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి - ఎమ్మెల్యే గిరిధర్‌కు సంఘం వినతి

ప్రజాశక్తి-గుంటూరు

ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్న వైసిపి ప్రభుత్వ విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ యూనియన్ నాయకులు ఆదివారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ఒక్క రూపాయి కూడా భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయలేదన్నారు. కనీసం కార్మికులకు కేటాయించాల్సిన సంక్షేమ బోర్డు నిధులను కూడా వారికి ఖర్చు చేయకపోగా, ఇతర అవసరాలకు దారి మళ్లిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికులకు సంక్షేమ పథకాలు వెంటనే అమలు చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైములు వెంటనే విడుదల చేయాలని, వైయస్సార్ బీమా పథకం కుటుంబ సభ్యులందరికీ వర్తింప చేయాలని కోరుతూ నగరంలో భవన నిర్మాణ కార్మికుల దగ్గర సంతకాలు సేకరించిన పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దష్టికి తీసుకెళ్తానని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నగర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాశింవలి, అధ్యక్షులు దొడ్డా కోటేశ్వరరావు, గౌరవాధ్యక్షులు ఆది నికల్సన్, సిఐటియు తూర్పు ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసరావు, బి.సత్యనారాయణ, ఎస్.పద్మనాభుడు, అక్కారావు, నాగేశ్వరావు, సీతారామయ్య, జె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్థానిక ప్రజలతో మాట్లాడుతున్న మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు

పీకలవాగుపై పేదలకు కుళాయి కనెక్షన్లు

ప్రజాశక్తి-గుంటూరు

నగరంలోని అన్ని డివిజన్లలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. 20వ డివిజన్‌లోని సంపత్ నగర్ చివర గల పీకలవాగు కట్టపై కొన్నేళ్లుగా నివశిస్తున్న పేదల గృహాలకు సూపర్ స్ట్రక్చర్ కుళాయి కనెక్షన్లు ఇవ్వటానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సంపత్ నగర్ చివర గల పీకల వాగు కట్టపై పేదలు ఎంతో కాలంగా నివాసం ఉంటున్నారని, కానీ వారికి ఇంటిపన్ను, కుళాయి కనెక్షన్లు లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీరిళ్లకు సూపర్ స్ట్రక్చర్ కింద పన్ను వేయించామని, ఇప్పుడు ట్యాప్‌లు వేయటానికి శంకుస్తాపన చేశామని చెప్పారు. ఈ ప్రాంతంలో నివశిస్తున్న ప్రజలకు అవుట్ ఫాల్ డ్రెయిన్ లేక మురుగు నీరు ఇళ్ళ మధ్య నిలిచిపోవటం వల్ల దోమలు పెరిగి స్థానిక ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నాయని, కావున సిమెంట్ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి పర్యటించి, అక్కడి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైసిపి 20వ డివిజన్ అధ్యక్షులు కె.శ్యాంశేఖర్, ఖాజా మొహిద్దీన్, ఫాతిమా, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

- క్షేత్రస్థాయి సమస్యలపై ప్రజా ప్రతినిధుల ప్రతిపాదనలు
- గడపగడపకు ప్రభుత్వంలో వచ్చిన పనులకు ప్రాధాన్యం
- ప్రజాశక్తితో జిల్లా ముఖ్య ప్రణాళిక శాఖ అధికారి శేషశ్రీ

గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి (సిపిఒ) పి.శేషశ్రీ తెలిపారు. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రజా ప్రతినిధులు పర్యటించిన సమయంలో ప్రజల నుంచి వచ్చిన వివిధ సమస్యల పరిష్కారం కోసం ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేసిందన్నారు. ఈ మేరకు సంబంధిత సచివాలయాల నుంచి అందిన ప్రతిపాదనల మేరకు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ అనుమతి ఇస్తారని, తర్వాత పనులు ప్రారంభిస్తారని ఆమె వివరించారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు.

సచివాలయాల పరిధిలో ఏయే పనులు చేస్తారు?

సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్లు, తాగునీరు, డ్రెయిన్లు, వీధి లైట్లు, కమ్యూనిటీ హాళ్లు తదితర పనులకు ఎక్కువగా ప్రతిపాదనలు అందాయి. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటించిన సందర్భంలో వచ్చిన సమస్యలను ఆయా సచివాలయాల పరిధిలో ఎంపిక చేసిన పనులకు జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు చేస్తారు. వీటిని జిల్లా కలెక్టర్ ఆమోదించి గ్రామ, వార్డు సచివాలయాల విభాగం పరిశీలనకు పంపుతారు. ఆ తరువాత పరిపాలన ఆమోదంతో పనులు ప్రారంభిస్తారు.

పనుల పురోగతి ఎలా ఉంది?

జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాలు 568 ఉన్నాయి. రూ.113.60 కోట్లు కేటాయించారు. ఇప్పటి వరకు 568 సచివాలయాల్లో 843 పనులకు జిల్లా కలెక్టర్, గ్రామ, వార్డు సచివాలయం శాఖ ఆమోదించింది. వీటిల్లో 498 పనులు వివిధ దశలో ఉన్నాయి. 275 పనులు పూర్తయ్యాయి. గ్రామీణ నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్, మున్సిపల్ పరిపాలన శాఖ, విద్యుత్ శాఖలకు సంబంధించి మొత్తం 843 పనులు మంజూరు చేయగా 492 పనులు ప్రారంభించారు. వీటిల్లో 322 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 140 పూర్తయ్యాయి. మొత్తం రూ.56.80 కోట్లతో ఈ నాలుగు శాఖలతో అభివృద్ధి పనులు మంజూరు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కొన్ని పనులు తిరస్కరించారు. పలు నియోజకవర్గాల్లో నామినేషన్ పద్ధతిపై కూడా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతించింది.

భూకమతాల సర్వే పూర్తయిందా?

కేంద్ర ప్రభుత్వం ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే సమగ్ర భూకమతాల సర్వే గతేడాది చేపట్టాం. ఇటీవల సర్వే నివేదికను ప్రభుత్వానికి ప్రభుత్వానికి పంపారు. మొదటి దశ సర్వే పూర్తయింది. భూమి హక్కు దారులు, భూమి స్వరూపం, సాగుభూమి, ఇతర వివరాలను రెవెన్యూ శాఖ ద్వారా సేకరించి ఆన్‌లైన్‌లో పొందుపర్చారు.

ఎంపి నిధుల వినియోగం ఎలా ఉంది?

పార్లమెంటు సభ్యులు ఎంపి ల్యాడ్స్ నిధులకు సంబంధించి ఇస్తున్న ప్రతిపాదనలకు ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్ ఆమోదించి పనులు చేపట్టేందుకు సంబంధిత శాఖలకు పంపుతున్నారు. ఇందుకు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయి.

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

12వ రోజుకు గుంటూరు ఛానల్ దీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకూ పొడిగించాలని, తక్షణమే భూసేకరణకు నిధులు విడుదల చేయాలని కోరుతూ నల్లమడ రైతు సంఘం ఆధ్వర్యంలో గుంటూరు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు ఆదివారంతో 12వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలను రైతు రక్షణ వేదిక నాయకులు టి.కృష్ణమూర్తి ప్రారంభించారు. దీక్షల్లో డి.హరిబాబు, టి.రమాదేవి, డి.ప్రమీల, పి.పెద్దమ్మాయి, ఎం.సుజాత, కె.సామ్రాజ్యం, టి.సరళాదేవి, కె.సంధ్యారాణి పాల్గొన్నారు. నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్ ప్రసంగించారు.

పోటీలో పాల్గొన్న క్రీడాకారులు, విజేతలతో కోచ్‌లు

కిక్ బాక్సింగ్‌లో హర్షప్రకాష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-గుంటూరు : గుంటూరు జిల్లా 10వ సబ్ జూనియర్, జూనియర్ గుంటూరు జిల్లా ఉషూ చాంపియన్‌షిప్-2023 పోటీలను ఆదివారం స్థానిక బి.ఆర్.స్టేడియంలో నిర్వహించారు. నెహ్రూ నగర్ 6వ లైను కుగ్‌ఫూ స్కూల్లో శిక్షణ పొందుతున్న తాళ్లూరి హర్షప్రకాష్ అండర్-29 కిలోల కిక్ బాక్సింగ్‌లో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా అసోసియేషన్ సెక్రెటరీ బి.నరసింహారావు మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీల్లో శ్రీకాకుళంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఉషు చాంపియన్‌షిప్ పోటీలకు తమ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు వివిధ విభాగాల్లో ఎంపికైనట్లు తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను చీఫ్ కోచ్ సాయికుమార్, ఎం.కిరణ్, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.